క్లుప్తంగా

టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవేందర్

కమలాపూర్ : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్-143) జిల్లా ఉపాధ్యక్షుడిగా కమలాపూర్‌కు చెందిన బాలసాని దేవేందర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఒస్కుల డేవిడ్, కూనూరి రంజిత్, టిమ్జూ -143 జిల్లా ఉపాధ్యక్షుడిగా గట్టు రఘుగౌడ్, సంయుక్త కార్యదర్శిగా తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ నియామకమైనట్లు యూనియన్ రాష్ట్ర కోశాధికారి, ఎన్నికల అధికారి యోగానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీని కలిసిన ఎల్కతుర్తి ఎస్సై



వరంగల్ క్రైం: ఎల్కతుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నితీ నిజాయితీతో సేవలు అందించాలని ఎస్సైకి సూచించారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



దామెర : బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు తోటి మిత్రులు. మండలంలోని ల్యాదెళ్లకు చెందిన నారగోని శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తన తోపాటు పదోతరగతి వరకు చదివిన తోటి మిత్రులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.32,000 నగదు 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, అశోక్, నిరంజన్, శంకర్, ప్రసాద్, శ్రీనివాస్, రాజేశ్వరి, శ్రీధర్, భాస్కర్, రవీందర్, రమణారెడ్డి, రవి, శ్రీధర్, శ్రీను ఉన్నారు.

బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవం

కమలాపూర్ : అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠాపన చేసి ఏడాది పూర్తైన సందర్భంగా కమలాపూర్‌లో మార్వాడి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామభక్తులు బుధవారం శ్రీరాముడి చిత్రపటాలతో జైశ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ సబ్ స్టేషన్ నుంచి రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. రామాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు లడ్డూ ప్రసాదాలు వితరణ చేశారు. అయోధ్యలో రామ మందిరం నిర్మించుకుని బాల రాముడి ప్రాణప్రతిష్ఠాపన చేసుకోవడం దేశ ఖ్యాతిని పెంచిందన్నారు. ఈ కార్యక్రమాల్లో మానిక్‌చంద్, రామభక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

ఆత్మకూరు : తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి కోటయ్య కుమారుడు కిరణ్ నిజామాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఆరోగ్యం బాగాలేక చికిత్స నిమిత్తం ఆత్మకూరు వచ్చాడు. ఈ క్రమంలో కోటయ్య మనవడు షాప్‌కు వెళ్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడిని వెతుకుతూ కోడలు వెళ్లింది. ఎంతసేపటికి వీరిద్దరూ తిరిగి రాలేదు. కోడలు మాధవి వయస్సు 35 ఏళ్లు, చామన చాయ రంగు, ఐదు ఫీట్ల ఎత్తు, ఇంటి నుంచి వెళ్లేముందు నలుపు-ఎరుపు రంగు పంజాబ్ డ్రెస్ ధరించిందని, అలాగే మనవడు సాయి రితీష్ 11 ఏండ్ల వయస్సు, 3 ఫీట్ల ఎత్తు, తెలుపు రంగులో ఉంటాడని, నీలం రంగు షార్ట్, చొక్కా వేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

శాయంపేట : తండ్రి మందలించాడని ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన కుమారుడిని పోలీస్‌లు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓర్సు రాజు తన కుమారుడు ధన్విక్ చెప్పినట్టు వినడంలేదని మందలించాడు. దీంతో మంగళవారం అర్ధరాత్రి ధన్విస్ తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భయాందోళన చెందిన కుటుంబ సభ్యులు డయల్ 100కు కాల్‌చేసి సమాచారం ఇచ్చారు. కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నవీన్ వెంటనే కొత్తగట్టు సింగారం గ్రామానికి వెళ్లి లోకేషన్ ఆధారంగా టెక్నికల్ టీం సహాయంతో చుట్టుపక్కల వెతికి ధన్విక్‌ను పట్టుకున్నారు. అనంతరం ధన్విక్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పరకాల ఏసీపీ సతీశ్‌బాబు, శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సై పరమేశ్ కానిస్టేబుల్స్‌ను అభినందించారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు



నిరుపయోగంగా దామెర క్రీడా ప్రాంగణం



ల్యాదెళ్ల క్రీడా మైదానంలో ఏపుగా పెరిగిన తుమ్మచెట్లు

- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- కానరాని క్రీడా సామగ్రి
- వినియోగంలోకి తేవాలని డిమాండ్

దామెర : గ్రామీణ ప్రాంత యువతీ, యువకుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసింది. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి సారించకపోవడంతో మైదానాలు నిరుపయోగంగా మారాయి. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే సంకల్పం ఉన్న యువతకు నిరాశే మిగులుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి క్రీడా ప్రాంగణాలనులను అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, స్థానికులు కోరుకుంటున్నారు.

ప్రజాధనం వృథా

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాల ఆవరణాల్లో, వివిధ గ్రామాల శివారు ప్రాంతాల్లో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి క్రీడా మైదానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను జాతీయ ఉపాధిహామీ నిధుల నుంచి ఒక్కో ప్రాంగణానికి సుమారు లక్షకు పైగా నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టింది. కానీ వాటి నిర్వహణపై అధికారులు దృష్టిసారించకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రజాధనం వృథా చేయడంపై ప్రజలు, యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని క్రీడా సామగ్రి

క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలోని యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో క్రీడా సామగ్రిని సమకూర్చారు. క్రికెట్ కిట్లు, వాలీబాల్, షటిల్, బాల్‌బ్యాట్మింటన్, టెన్నికయిట్ వంటి క్రీడాసామగ్రిని కిట్లు గ్రామ పంచాయతీలకు అందించారు. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. క్రీడా సామగ్రి యువతకు అందుబాటులో ఉంచి వారిని ప్రోత్సహించాలని యువతతో పాటు పలువురు కోరుకుంటున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన క్రీడా ప్రాంగణాలు చివరికి మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. క్రీడా ప్రాంగణాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. క్రీడా మైదానాలకు ప్రహరి లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని క్రీడాకారులతో పాటు ప్రజలు డిమాండ్ చేసున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

దామెర గ్రామంలో క్రీడా మైదానం పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. కానీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదు. క్రీడా మైదానంలో వాలీబాల్, ఖోఖో, బ్యాట్మింటన్ కోర్టులు ఏర్పాటు చేయాలి. క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచి క్రీడా పోటీలు నిర్వహించాలి.

- నానబోయిన మోహన్, స్థానికుడు

చర్యలు చేపడుతాం..

యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. నిరుపయోగంగా ఉన్న క్రీడా మైదానాలను చదును చేసి త్వరలో క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తాం. క్రీడా సామగ్రి యువతకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి

ధర్మసాగర్ : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సీపీఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు అర్హులకే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో లబ్ధిపొందిన వారికే మళ్లీ లిస్ట్‌లో పేర్లు నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నందున మళ్లీ సర్వే చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బట్టు మల్లయ్య, కొట్టే ప్రభాకర్, కొట్టే వెంకటేశ్, రాజిరెడ్డి, రాజారపు రత్నంతో పాటు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్రే భిక్షపతి

ముసగేసిన మంచు దుప్పటి



మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10గంటల వరకు పొగ మంచు కమ్ముకుంది. దీంతో ప్రజలు చలితో వణికిపోయారు. పొగ మంచు కారణంగా రోడ్డు కనపడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

- శాయంపేట

బాధితులకు అండగా ఉంటా

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. అగ్రంపహాడ్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మాదాసి సుశీలమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, నాయకులు మాదాసి రాజు, బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నడికూడ మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన పంచాయతీరాజ్ శాఖ ఈఈ గూడెం శంకరయ్య తల్లి గూడెం నర్సవ్వ ఇటీవల మృతిచెందిందగా ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై విద్యార్థులు పోరాడాలని ఏబీవీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ కోరారు. కాకతీయ యూనివర్సిటీలో ఏబీఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేయూ అధ్యక్షుడు పాల్గొన్నారు.

అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



పరకాల : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

- డీఎల్‌పీఓ గంగాభవాని
- ఆందోళన అవసరం లేదని స్పష్టం
- అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని పలుచోట్ల రైతులు, ప్రజల నిరసన

ధర్మసాగర్ : సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని డీఎల్‌పీఓ గంగాభవాని స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని పెద్ద పెండ్యాల, సాయిపేట, జానకిపూర్, సోమదేవరపల్లి, దేవనూరు, కాషగూడెం, కరుణాపురం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ అర్హులకు సంబంధించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాను చదివి వినిపించారు. ఆయా గ్రామసభల్లో ఎంపీఓ అఫ్జల్, ఆర్‌ఐలు కిరణ్, అనిత, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దామెర : సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక జాబితా పారదర్శకంగా చేపడుతున్నట్లు ఎంపీఓ రంగాచారి తెలిపారు. మండల కేంద్రంతోపాటు దమ్మన్నపేట్, తక్కళ్లపహాడ్, వెంకటాపూర్‌లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి బాలరాజు, ఆర్‌ఐ సంపత్, కార్యదర్శి మనోహర్, నాయకులు పోచయ్య, భిక్షపతి, ప్రవీణ్, రవికుమార్, కట్టయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో రసాభాస..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లోని వివిధ గ్రామాల్లో చేపట్టిన గ్రామసభల్లో బుధవారం రసాభాసగా నెలకొంది. రెండోరోజు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో అధికారులు గ్రామ సభ నిర్వహించగా ప్రజలు, రైతులు ముకుమ్మడిగా ఆందోళనకు దిగారు. రుణమాఫీ కాలేదని అధికారులను నిలదీశారు. పోలీసులు జోక్యం చెసుకుని వారిని గ్రామసభ నుంచి బయటకు పంపించారు. అలాగే కొత్తపల్లి, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అవకతవకలు జరిగాయని పలువురు ఆరోపించారు. కొత్తపల్లిలో నిర్వహించిన గ్రామ సభ జాబితాలో మా పేర్లు ఎందుకు రాలేందంటూ పలువురు ధరఖాస్తు దారులు గ్రామ సభలో ఆందోళనకు దిగారు. దీంతో సభ రసాభాసగా మారింది. ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ ఆధ్వర్యంలో ఎస్సైలు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ వీరేశం, పంచాయతీ కార్యదర్శి పూర్ణచందర్, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తు స్వీకరణ

భీమదేవరపల్లిలో రేషన్‌కార్డుల మంజూరు కోసం 815, ఇందిరమ్మ ఇళ్ల కోసం 582, రైతు భరోసా కోసం 57 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 152 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

పరకాల : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా అర్హుల ఎంపికలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ సుష్మ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 3,4,15,16,17,22 వార్డులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం వార్డు సభ నిర్వహించారు. జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం చేపట్టిన సభను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. గురువారం 1,2,12,13,14 వార్డులకు పరకాల సీఎస్‌ఐ స్కూల్‌లో ఏర్పాటు సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, కౌన్సిలర్స్ గోపి, జయంత్ లాల్, భద్రయ్య, సంతోశ్, రమాదేవి, సుజాత, మున్సిపల్ ఆర్‌ఓ రఘు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కటాక్షపూర్ ప్రత్యేక అధికారి డాక్టర్ ధర్మానాయక్ స్పష్టం చేశారు. మండల కేంద్రంతో పాటు కటాక్షపూర్, చౌళ్లపల్లి, లింగమడుగుపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలనలో భాగంగా బుధవారం గ్రామసభలు నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జబితాలో పేర్లురాని వారు అందించిన దరఖాస్తులను స్వీకరించారు. పలువురు తమ పేర్లు జాబితాలో లేవని అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేందర్, మండల ప్రత్యేక అధికారి మహేందర్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీఓ విమల, ఎంఈఓ విజయ్‌కుమార్, జీపీ ప్రత్యేక అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేట : వ్యవసాయ యోగ్యమైన పట్టా భూములకు రైతు భరోసా వచ్చేలా చూస్తామని తహసీల్దార్ సత్యనారాయణ రావు అన్నారు. ఈనెల 26న అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం మండలంలోని మైలారం, జోగంపల్లి, ఆరెపల్లి, గట్లకానిపర్తి, హుస్సేన్‌పల్లి, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. మైలారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ సత్యనారాయణ రావు పలు సూచనలు చేశారు. వివిధ గ్రామాల కార్యదర్శులు, ఏఈఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐనవోలు: మండలంలోని పంథిని, పెరుమాండ్లగూడెం, కక్కిరాలపల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్ల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ముందుగా అధికారులు నాలుగు పథకాల్లో అర్హులైన వారి పేర్లను గ్రామ సభకు చదివి వినపించారు. కాగా కొంతమంది మా పేర్లు ఎందుకు తొలగించారంటూ అధికారులను నిలదీశారు. అర్హత లేనివారి పేర్లు లిస్టులో ఉన్నాయని ఆరోపించారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు



సుదర్శన నారసింహ హవన పూర్ణాహుతి నిర్వహిస్తున్న వెంకటరత్నం ఆచార్యులు



కల్యాణంలో మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు జయకృష్ణ, విక్రమ్

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో స్వయంభూగా వెలిసిన స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణం జరిపించారు. నిత్యపూజల అనంతరం లక్ష్మీనరసింహ స్వామి స్తంభమూర్తి, గర్భాలయంలోని ధ్రువ మూర్తులు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తూ విశేషంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ-నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. అర్చన, నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్, విక్రమ్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని

ఎంఈఓకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న తమకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని భోజన కార్మికులకు కోరారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంఈఓ భిక్షపతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి రామ్మూర్తి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం సరైన సమయంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోడి గుడ్ల రేట్లు విపరీతంగా పెరిగాయని, వారానికి మూడుసార్లు విద్యార్థులకు వడ్డించడం వీలుకాదని, ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రచురించిన విధంగా వంట కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం చెల్లించి, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల అధ్యక్షురాలు మామిడి రాధమ్మ, దాసరి దేవక్క, మామిడి స్వరూప పాల్గొన్నారు.



ఎంఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయలు

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గల సీఎస్‌ఐ బీజేఎం ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సామ్ జార్జ్ మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి రానున్న వార్షిక పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిబియా, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, రాజన్న, రాజునాయక్, ప్రవళిక, శైలజ, విజయ్, సామెల్, బెన్షాజీ, ఉమ, శృతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే నమూనా పరీక్షలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ధర్మసాగర్ : విద్యార్థుల జ్ఞాన, భావోద్వేగ, ప్రవర్తన సామర్థ్యాలు తెలుసుకునేందుకు మానసిక సామర్థ్య అంచనా పరీక్షలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆస్మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ సదస్సుకు హాజరై మాట్లాడారు. ఆసక్తి, అభిరుచి, ప్రాథమిక నైపుణ్యాల ఆధారంగా విద్యార్థులు వివిధ విద్యా కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ రంగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు అప్రమత్తతతో ఉండి ఉన్నత విద్యలో ఆధునిక కోర్సులను ఎంపిక చేసుకోవాలని కోరారు. అనంతరం ఆస్మాన్ ఫౌండేషన్ ప్రతినిధి నానాజీ మాట్లాడుతూ.. ఉన్నత విద్యాతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. నిట్, క్లాట్, జేఈఈ పరీక్షలకు ముందస్తు నమూనా పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా 200 మంది విద్యార్థులకు మానసిక సామర్థ్య అంచనా పరీక్షను నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు ఆజం, ప్రభాకర్, రాజేందర్, లావణ్య, ఉషారాణి, గోపాలకృష్ణ, బాబురావు, రాములు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి



మాట్లాడుతున్న దామోదర్

ఐనవోలు : విద్యార్థినులు చదువుపై దృష్టి సారిస్తునే ఉన్నతమైన ఆలోచనలు, ఆత్మవిశ్వాసంతో ఎదగాలని హనుమకొండ సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం సీనియర్ సిటీజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఉభయ సంస్థల ఆధ్వర్యంలో సంస్కార వికాస శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులు చదువులో రాణిస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా నైపుణ్యాలను అలవర్చుకోవాలని అన్నారు. సన్మార్గంలో పయనిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు, పెద్దలపై గౌరవం, దేశభక్తి, సామాజిక సేవాదృక్పథం అలవరుచుకోవాలన్నారు. సంస్థ జిల్లా కార్యదర్శి యుగేందర్, పాఠశాల ఎస్ఓ సునితా, రిటైర్డ్ ఎస్సై రాజమౌళి, వర్ధెల్లి మలహల్ రావు తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలకు రూ.1,8500 విలువచేసే మైక్ సెట్‌ను కనుపర్తి నర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, ఐనవోలు తహసీల్దార్ కనుపర్తి విక్రమ్‌కుమార్ బుధవారం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రజిత మాట్లాడుతూ.. దాతల సహకారం వెలకట్టలేనిదని అన్నారు. పాఠశాలకు మైక్‌సెట్‌ను అందించిన విక్రమ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఉపాధ్యాయులు శేషగిరి, నర్సింహారెడ్డి, అశోక్ కుమార్, రఫీ, కుటుంబరావు, శ్రీనివాస్, ఆర్‌ఐ మల్లయ్య, అంగన్‌వాడీలు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సంబురాలు

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయీ హమాలీల కూలీ రేట్ల జీఓను అమలుపరచడంతో బుధవారం వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద హమాలీలు స్వీట్లు పంపిణీ చేసుకుని సంబురాలు జరుపుకొన్నారు.